క్లుప్తంగా

పరీక్ష కేంద్రం తనిఖీ


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను మంగళవారం తహసీల్దార్ బెన్నురాజ్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో ప్రథమ, ద్వితీయ ఇంటర్ పరీక్షలు ఎంతమంది రాస్తున్నారు, విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించారా లేదా అని పరీక్ష చీఫ్ మురళీకృష్ణను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు.

ఈకేవైసీ తప్పనిసరి

ఐరాల: పీఎం కిసాన్ పథకం లబ్ధి కోసం రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వరలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 4,896 మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారని, మిగిలిన 91 మంది రైతులు బ్యాంక్‌లో ఆధార్, ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈకేవైసీ చేయించుకోని వారి పూర్తి జాబితా ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఉందని, ఆర్బీకే సిబ్బంది ఇదివరకే సమాచారాన్ని అందించారన్నారు. కావున ఆర్బీకేలలో ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని, లేకుంటే పీఎం కిసాన్ లబ్ధి చేకూరదని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోపు చేయించుకోవాలన్నారు.

చెత్త రహిత గ్రామాలుగా మార్చాలి


గ్రామంలో శుభ్రం చేయిస్తున్న ఎంపీడీఓ


పూతలపట్టు: మండలంలోని పలు గ్రామాలను చెత్త రహితంగా మార్చాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మంగళవారం చిటిపిరాళ్ల పంచాయతీ గ్రామాలలో ఉన్న చెత్తను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. వీరితో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొని గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ సుశీల, మండలంలోని సచివాలయ సెక్రటరీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేలం పాటలో రూ.89 వేల ఆదాయం


వేలం పాటలు నిర్వహిస్తున్న ఏఎస్ఐ అయేషాబేగం

తవణంపల్లె: మండలంలో పలు కేసుల్లో పట్టుబడిన మూడు వాహనాలను వేలం పాట వేయడంతో రూ.89, 090 ఆదాయం వచ్చినట్టు తవణంపల్లె ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మంగళవారం తవణంపల్లె పోలీస్‌స్టేషన్‌లో పలు కేసుల్లో పట్టుబడిన బజాజ్ పల్సర్ మోటారు సైకిల్, మారుతి ఆమ్నీ కారు, ఇండికా వీ2 కార్లు వాహనాలకు ఎస్ఈబీ ఏఎస్ఐ అయేషా బేగం ఆధ్వర్యంలో వేలం పాటు నిర్వహించినట్లు వివరించారు. మూడు వాహనాలకు వేలం పాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వానికి పంపుతామన్నారు.

తవణంపల్లె వైద్యాధికారిగా డాక్టర్ మోహన్ వేలు



తవణంపల్లె : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి ప్రత్యేకంగా ఇద్దరు వైద్యాధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయ చౌదరి తెలిపారు. ఈ మేరకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కోసం మంగళవారం డాక్టర్ మోహన్ వేలు, డాక్టర్ పాయల వినయ్‌కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారని తెలిపారు.

ఉద్యోగం పేరుతో మోసం చేశారు

చిత్తూరు రూరల్: ఉద్యోగం పేరుతో ఓ వ్యక్తి మోసం చేశాడని పూతలపట్టు మండలం తోటవారిపల్లెకు చెందిన మాధవన్ ఆరోపించాడు. చిత్తూరులోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాధవన్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2019లో పోలీసు విభాగంలో ఉద్యోగం ఇప్పిస్తానని గంగాధరనెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి మోసం చేసినట్టు తెలిపాడు. ఇందుకు రూ.3 లక్షలు నగదు ఇచ్చానన్నాడు. మోసపోయినట్లు తెలుసుకున్న తర్వాత డబ్బులడిగితే మహిళలను అడ్డుపెట్టుకుని బెదిరిస్తున్నట్లు ఆరోపించాడు. అతడి నుంచి రక్షణ కల్పించాలని మాధవన్ కోరారు.

చిత్తూరు రూపురేఖలు మారుస్తాం!



మాట్లాడుతున్న మేయర్ అముద, బడ్జెట్ గణాంకాలు వివరిస్తున్న కమిషనర్ అరుణ, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


పాల్గొన్న కార్పొరేటర్లు

- రూ.113.93 కోట్ల మిగులు బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం
- మౌలిక వసతులు, ప్రజా అవసరాలకే ప్రాధాన్యం
- గణాంకాలను పాలకులకు వివరించిన కమిషనర్ అరుణ
- నగర అభివృద్ధికి రూ.వంద కోట్లతో ప్రణాళికలు : ఎమ్మెల్యే ఆరణి
- ప్రతి వార్డులోనూ వసతులు కల్పిస్తాం : మేయర్

నిధుల ఖర్చు అంచనాలు ఇలా..		
రోడ్లు	:	రూ.9 కోట్లు
కాలువలు	:	రూ.2.40 కోట్లు
నీటి సరఫరా	:	రూ.28 కోట్లు
వీధి దీపాలు	:	రూ.4 కోట్లు
పార్కులు	:	రూ.3.20 కోట్లు
పారిశుద్ధ్యం	:	రూ.22.33 కోట్లు
ఎస్సీల కోసం	:	రూ.3.69 కోట్లు
ఎస్టీలకు	:	రూ.1.84 కోట్లు
స్త్రీ శిశు సంక్షేమం	:	రూ.1.23 కోట్లు
పేద వాడల అభివృద్ధి	:	రూ.9.84 కోట్లు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ 2023–24 సంవత్సరం బడ్జెట్ అంచనాలను పాలకవర్గం ఆమోదించింది. నగరపాలక సంస్థ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం మంగళవారం నగరపాలక సమావేశ మందిరంలో మేయర్ ఎస్.అముద అధ్యక్షతన జరిగింది. రూ.113.93 కోట్ల మిగులు బడ్జెట్‌తో రూపొందించిన అంచనాలకు పాలకవర్గం ఆమోద ముద్ర వేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో నగరపాలక సంస్థకు ప్రారంభపు నిల్వతో కలిపి మూలధన జమల ద్వారా రూ.273,12,35,033 వస్తుండగా, రూ.195,01,25,860 సాధారణ వ్యయంగా అంచనా వేశారు. రూ.113.93 కోట్ల మిగులుతో బడ్జెట్ గణాంకాలను కమిషనర్ డా.అరుణ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పాలకులకు వివరించారు. ఎక్స్ అఫిషియో సభ్యుల హోదాలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రసంగించారు.

ఈ బడ్జెట్లో నగరంలో రోడ్లు, వీధి దీపాలు, నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నట్లు కమిషనర్ వివరించారు. విలీన పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు వివరించారు. చిత్తూరు శాశ్వత తాగునీటి సరఫరా కోసం ఉద్దేశించిన అడవిపల్లి రిజర్వాయర్ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఇందులో భాగంగా ఏడు ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులు మంజూరైనట్లు కమిషనర్ వివరించారు. అనంతరం ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం, ప్రణాళిక, రెవెన్యూ, మెప్మా, సాధారణ పరిపాలన, వార్డు సచివాలయాలు అంశాలపై శాఖాధికారులు ప్రెజెంటేషన్ ఇచ్చారు.

ప్రతి వార్డులోనూ అభివృద్ధి పనులు..

నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ అముద చెప్పారు. నగరపాలక సంస్థ అత్యవసర కౌన్సిల్ సమావేశం మంగళవారం మధ్యాహ్నం జరిగింది. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర కమిషనర్ డా. జె.అరుణ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం, ఇతర ప్రభుత్వ నిధుల ద్వారా అన్ని వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనుల కోసం ఇటీవలే రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి చర్చించడం జరిగిందన్నారు. చిత్తూరు అభివృద్ధికి రూ.100 కోట్లు నిధులు మంజూరు చేయడానికి సీఎంకు ప్రణాళికలు ఇచ్చామన్నారు. వీటితోపాటు నగరంలోని ఐదు ప్రధాన రహదారులను రూ.20 కోట్లతో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. నగర పరిధిలోని ప్రధాన వార్డులతో పాటు, విలీన పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

వీటికి ఆమోదం..

సీబీఐ రోడ్డు (కార్నేర్స్ బంగళా రోడ్డు) పేరును బీఎస్ కణ్ణన్ రోడ్డుగా నామకరణం చేయడానికి, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ –2016 మేరకు తేనె బండ వద్ద సీ అండ్ డీ వేస్ట్ ప్లాంట్ నిర్మాణం కోసం ఏజెన్సీని గుర్తించి ఆమోదించడం, నగరపాలక సంస్థ వాహనాల షెడ్ ఎదురుగా ఉన్న స్థలంలో ఎక్స్ సర్వీస్‌మన్ యూనియన్ అభ్యర్థుల మేరకు సైనికుల జ్ఞాపకార్థమై స్థూపం ఏర్పాటుకు స్థలం కోసం తహసీల్దార్‌కు పంపేందుకు, నగరంలోని కూరగాయల మార్కెట్, జంతు వధశాల, ఎన్టీఆర్ బస్టాండ్, కాసు బ్రహ్మానంద రెడ్డి బస్టాండ్లకు 2023–24 సంవత్సరానికి బహిరంగ వేలం పాట నిర్వహించడానికి ఆమోదించారు. నగిరిపల్లెలో 22.10 ఎకరాల భూమిని జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్‌కు లీజుకు ఇచ్చేందుకు తహసీల్దార్‌కు నివేదిక, అంగన్‌వాడీ కేంద్రం స్థలంలో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు, 33,34,35 వార్డులకు సంబంధించి ఆర్టీసీ డిస్పెన్సరీ ఎదురుగా ఉన్న స్థలంలో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎంఈ ధనలక్ష్మి, ఎంహెచ్ఓ డా.లోకేష్, ఏసీపీ రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఎంఎం గోపి పాల్గొన్నారు. కాగా బడ్జెట్ గణాంకాలను రూపొందించడంలో సభ్యుల సలహాలు తప్పనిసరని కార్పొరేటర్ వి.వెంకటరమణ, మున్సిపల్ ఉద్యోగులు ఎక్కువగా ఉన్న తన వార్డులో అభివృద్ధి పనులు చేయడంలేదని సన్ని షర్మిల, చామంతిపురంలో ఓవర్‌హెడ్ ట్యాంకు పెట్టాలని ఇందు, నీటి వసతులను ప్రతీచోటా పెట్టాలని హరిణిరెడ్డి పేర్కొన్నారు.

31న ఆసరా చెక్కు పంపిణీ

పూతలపట్టు: ఈనెల 31న శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఆసరా మూడవ విడత చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గౌరి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున మండల స్థాయి అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని తెలిపారు.

యాదమరి ఏపీఓగా మీనా

యాదమరి: యాదమరి ఉపాధి ఏపీఓగా మీనాను నియమిస్తున్నట్లు డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. యాదమరి మండలంలో ఉపాధి హామీ పథకంలో కూలీలు చేసిన పనులకు ఫీల్డ్ అసిస్టెంట్ తన బంధువులపై బిల్లులు చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో ఇదివరకే ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించారు. ఆపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏపీఓ కవితను సీఎల్ఆర్సీ విభాగానికి బదిలీ చేసినట్లు వివరించారు. ఆమె స్థానంలో ప్రసూతి సెలవులో ఉన్న మీనాను యాదమరి ఏపీఓగా నియమిస్తున్నట్లు తెలిపారు.

పది గంటలపైన కూలీ పనులు చేయొద్దు

యాదమరి: కూలీలు ఉదయం 10 గంటలపైన పనులు చేయరాదని వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ సూచించారు. మంగళవారం కీనాటంపల్లె దళితవాడలో కూలీలతో సమావేశం నిర్వహించారు. ఎండ ఎక్కువగా ఉందని కూలీలు ఉదయం 10 గంటలలోపు, సాయంత్రం 4 గంటలపైన పనులు చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

చిత్తూరు రూరల్: చిత్తూరులోని కోదండరామస్వామి ఆలయంలో బుధవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఉదయం 10 గంటలకు విష్వక్సేన తిరుమంజనం, మధ్యాహ్నం ఒంటి గంటకు మహా స్నపన తిరుమంజనం, 3 గంటలకు అంకుర్పాణం పూజలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఏర్పాట్లను పూర్తిచేశామని అర్చకులు వేణుగోపాల్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీకి మహిళలే బలగం


హాజరైన మహిళలు


చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీ

చిత్తూరు రూరల్: వైఎస్సార్‌సీపీకి మహిళలే బలగమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో మంగళవారం మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, డీఆర్డీఏ పీడీ తులసి 574 డ్వాక్రా సంఘాలకు సంబంధించిన రూ.5.04 కోట్ల మెగా చెక్కును అందజేశారు. అలాగే ఉన్నతి పథకం కింద 132 సంఘాలకుగాను రూ.62.17 లక్షల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అన్నారు. మహిళాభ్యున్నతికి ప్రభుత్వం నిర్విరామంగా కృషిచేస్తోందన్నారు. అన్ని వర్గాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తున్నారని తెలిపారు. ఇందులో మహిళలే ఎక్కువగా ఉన్నారని చెప్పారు. ఇచ్చిన మాట మేరకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలకు రుణ మాఫీ చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించి, మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైస్ ఎంపీపీలు జయరాం, రంజని, వైఎస్సార్‌సీపీ నేతలు త్యాగరాజులు, సంపత్, ప్రతిమారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జయపాల్, మునిరత్నం, రాబర్ట్, సుదర్శన్, వి.బాబు, దిలీప్, ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ, ఏపీఎం విజయభాస్కర్ పాల్గొన్నారు.

సింహవాహనంపై శ్రీరాముడి విహారం


సింహవాహనంపై విహరిస్తున్న శ్రీరాముడు

తవణంపల్లె: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తవణంపల్లె కోదండరామ స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి సింహవాహనంపై శ్రీరాముడు కొలువుదీరి విహరించారు. ఉదయం సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ఉభయదారులు ఎ.అరుణకుమార్ కుటుంబసభ్యులతో సింహ వాహనసేవ నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజాసామగ్రి, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు ఉత్సవమూర్తి శ్రీరామచంద్రుడికి అభిషేకం, పూజలు చేయించి నైవేద్యం సమర్పించారు. అనంతరం సింహవాహనంపై కొలువుదీరిన శ్రీరాముడు పురవీధుల్లో కొలువుదీరి ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు.

నేడు కోదండరామస్వామి దేవస్థానంలో హనుమంత సేవ

తవణంపల్లెలో వెలసియున్న కోదండరామస్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామికి అభిషేకం, పూజలు, రాత్రి హనుమంతు వాహనసేవ ఉభయదారులచే ఘనంగా నిర్వహిస్తామని కార్యనిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

గుడిపాల: మండలంలోని కోలావూరు గ్రామంలో గురువారం నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 30న శ్రీరామజననంతో పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, 31న విశ్వామిత్ర యాగ సంరక్షణ, ఏప్రిల్ 1న సీతారామ కల్యాణం, 2న శ్రీరామ పాదుకా పట్టాభిషేకం, 3న భక్త శబరీ మోక్షం, 4న సుగ్రీవ పట్టాభిషేకం, 5న సుందరకాండ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, 6న అంగద రాయబారం–రామ రావణయుద్ధం, 7న శ్రీరామ పట్టాభిషేకంతో పాటు రాత్రి సహపంక్తి భోజనంతో పాటు రాత్రి సీతారామలక్ష్మణస్వామి ఊరేగింపు బాణసంచ వేడుకల మధ్య జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

ఆదర్శ పుణ్యక్షేత్రంగా బోయకొండ


హాజరైన ఉద్యోగులు


సూచనలిస్తున్న పెద్దిరెడ్డి, ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ దేవస్థానాన్ని సమష్టిగా పనిచేసి రాష్ట్రంలోనే ఆదర్శ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయ పరిపాలన కార్యాలయంలో దేవస్థానం ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన పెద్దిరెడ్డి మాట్లాడుతూ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని, భక్తుల మనోభావాలు దెబ్బతీయకుండా సులభతరంగా అమ్మవారి దర్శన భాగ్యం పొందేలా చూడాలని తెలిపారు. బోయకొండను రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. సిబ్బంది అక్రమాలకు పాల్పడినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలకు సిఫార్స్ చేస్తామని హెచ్చరించారు.

త్వరలో సమాచార కేంద్రం

ఈఓ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం త్వరలో సమాచార కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. పనివేళల కేటాయింపు, షిఫ్ట్ పద్ధతులను వివరించారు. సిబ్బంది సమష్టిగా పనిచేస్తూ ఆలయ ఆదాయాన్ని పెంచాలని సూచించారు. భక్తులకు దర్శనానంతరం ప్రతి భక్తుడికీ పుష్పం, ప్రసాదం, కుంకుమ అందేలా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు ఎన్నడూలేని విధంగా ఉద్యోగ భద్రత, ఉత్తమ సేవలందించిన సిబ్బందికి బోనస్‌లు సైతం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

నేడు గుడిపాలలో వైఎస్సార్ ఆసరా

గుడిపాల: మండలంలోని నరహరిపేట హైస్కూల్ ఆవరణలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం ఈశ్వరి అన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు మూడవ విడత ఆసరా నిధుల పంపిణీ కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొంటారని ఆమె తెలిపారు. మండలంలోని డ్వాక్రా సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తప్పకహాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


కాణిపాకం ఉన్నత పాఠశాలలో ఎంఈఓ

ఐరాల: ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఐరాల, ఎం.పైపల్లె, కాణిపాకం ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. పాఠశాలలో పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఇంగ్లిష్ టెక్స్ట్‌బుక్స్ చదివించారు. విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పోషకాహార పదార్థాల ప్రదర్శన


పోషకాహార పదార్థాల ప్రదర్శన చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

తవణంపల్లె: మండలంలోని వెంగంపల్లెలో మంగళవారం అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ వలంటీర్లచే పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలపై అవగాహన కోసం ప్రదర్శన చేశారు. ప్రదర్శనలో గ్రామస్తులు పాల్గొని పోషకవిలువలు కలిగిన ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల గురించి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వెంగంపల్లెలో వారం రోజులుగా ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

'టెన్'షన్ వద్దు!

- ఒత్తిడికి దూరంగా ఉండాలి
- తేలిక ఆహారాన్ని తీసుకోవాలి
- పదో తరగతి విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్న డాక్టర్లు

బంగారుపాళెం: పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతూ ఆహార విషయంలో అశ్రద్ధ చేస్తుంటారు. రాత్రుల్లో సమయానికి నిద్రపోకుండా చదవడం, ఉదయం ఆహారం తీసుకోకుండా పరీక్షలకు వెళ్లడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తి పరీక్షలు సక్రమంగా రాయలేని పరిస్థితులు నెలకొంటాయి. పరీక్షల సమయంలో శరీరంతో పాటు మెదడుని చురుగ్గా నియంత్రణలో పెట్టుకోవడం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. సరైన తిండి, నిద్ర లేకుంటే ప్రతిభ కలిగిన విద్యార్థి సైతం సాధారణ విద్యార్థితో సమానం అవుతాడు. పరీక్షల సమయంలో ఆహార ప్రణాళిక, నిద్ర, వ్యాయామం పాటించి ఆరోగ్యాన్ని పదిలంగా పెట్టుకుంటే ఆశించిన ఫలితాలను సాధించవచ్చని అంటున్నారు. పరీక్ష కేంద్రాల్లో అనారోగ్యానికి గురైన విద్యార్థులకు అవసరమైన వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్య కార్యకర్తలు అందుబాటులో ఉంటారు. ఆహారం తీసుకోకుండా పరీక్షలకు వెళ్లడం వల్ల నీరసం వస్తుంది. కళ్లు తిరుగుతాయి, నిద్రలేమి కారణంగా అలసట వస్తుంది. దీంతో పరీక్షలు రాయలేని పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు ఉదయం తప్పనిసరిగా ఆహారం తీసుకుని పరీక్ష కేంద్రాలకు వెళ్లాలి. ఒత్తిళ్లను తట్టుకోవడానికి, జ్ఞాపకశక్తిని పెంచుకోవడానికి సమతుల్య ఆహారం ఎంతో అవసరమని వైద్యులు చెబుతున్నారు. మసాలా, నూనె వంటకాలు తినకూడదన్నారు. పొద్దునే తీసుకునే ఆహారంలో ఇడ్లీ, పెసరట్టు, రవ్వ ఉప్మా వాటితో పాటు గ్లాసు పాలు, ఏదైనా పండ్లు తీసుకుంటే మంచిదన్నారు. మధ్యాహ్నం, రాత్రుల్లో శక్తినిచ్చే తేలిగ్గా జీర్ణమయ్యే అన్నం, రొట్టె, కూరగాయలు, పప్పుధాన్యాలు, కోడిగుడ్డు ఆహారంగా తీసుకోవాలి. రాత్రి 10 గంటలకు చదువుకుని అనంతరం గ్లాసు పాలు తాగి నిద్రపోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


మెదడు చురుకుదనాన్ని పెంచే పౌష్టికాహారం

నియోజకవర్గంలో పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులు		
మండలం	కేంద్రాలు	పరీక్షలు రాస్తున్న విద్యార్థులు
బంగారుపాళెం	4	838
పూతలపట్టు	2	545
ఐరాల	3	350
తవణంపల్లె	2	339
యాదమరి	2	426

కాఫీ, టీలకు దూరంగా ఉండాలి..



పరీక్షలకు వెళ్లే విద్యార్థులు కాఫీ, టీలకు దూరంగా ఉండాలి. శారీరక, జ్ఞాపకశక్తిని పెంచే సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. పాలు, గంజి, పండ్లు, పండ్ల రసాలు తీసుకుంటే మంచిది. మానసిక ఏకాగ్రతను పెంచే వ్యాయామం చేయాలి. కార్బోహైడ్రేట్లు లభించే పౌష్టికాహారాన్ని సకాలంలో తీసుకోవాలి.

డాక్టర్ విజయకుమారి, ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి, బంగారుపాళెం

మానసిక ఒత్తిడికి గురికాకూడదు:



పది పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా ఉండాలి. భయాన్ని వీడి ఏకాగ్రతను అలవాటు చేసుకోవాలి. మనసు ప్రశాంతంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలి. సకాలంలో నిద్ర, ఆహార నియమాలను పాటించాలి.

డాక్టర్ లోహిత్ చెంగ్రల్రాయన్, తుంబకుప్పం పీహెచ్‌సీ